సాక్షి నారాయణపేట

సోమవారం : 22 : మే : 2023



ఆర్చరీ కేరాఫ్ పాలమూరు

విలువిద్య (ఆర్చరీ) క్రీడలో పాలమూరు క్రీడాకారులు సత్తా చాటుతున్నారు.

వివరాలు 8లో ▸



చల్లగా తాగేస్తున్నారు..!

ఉమ్మడి జిల్లాలో మద్యంప్రియులు రికార్డు స్థాయిలో బీర్లు తాగేస్తున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
39.3 /27.2

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆరోగ్య సిబ్బంది కొవ్వొత్తులతో నివాళి



నారాయణపేట రూరల్: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఎయిడ్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా ఆస్పత్రి నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు మౌనంగా నడిచి శ్రద్ధాంజలి ఘటించారు. ఎయిడ్స్ వ్యాధి సోకి చనిపోయిన వారికి నివాళి అర్పిస్తూ చేపట్టే అంతర్జాతీయ క్యాండిల్ లైట్ షో కార్యక్రమం చేపట్టినట్లు హెల్త్ సూపర్‌వైజర్ అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తబిత, సుధాకర్‌బాబు, లింక్ వర్కర్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



నర్వ: గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలని డీఎల్‌పీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం లంకాల్, రాంపూర్ గ్రామాల్లో ప్రత్యేక శానిటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు కాలనీల్లో తిరిగి పారిశుద్ధ్య చర్యలను పరిశీలించారు. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేయాలని చెప్పారు. వీధులలోని అంతర్గత రహదారులతో పాటు, గ్రామ ముఖ్య కూడళ్లలోని రహదారులను శుభ్రపర్చాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పిచికారీ చేయించాలన్నారు. రహదారులకు ఇరువైపులా ఆహ్లాదాన్ని, మంచి గాలినిచ్చే చెట్లను నాటి సంరక్షించాలన్నారు. రహదారులకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఉంటే తొలగించాలన్నారు. పారిశుద్ధ్య చర్యలు క్రమంగా నిర్వహించే విధంగా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పర్యవేక్షించాలన్నారు. ఈ పరిశీలనలో ఆయన వెంట ఎంపీడీఓ రమేష్‌కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కోటకొండపై చిన్నచూపు ఎందుకు?



నారాయణపేట రూరల్: వెనకబడిన కోటకొండపై రాష్ట్ర ప్రభుత్వానికి చిన్నచూపు తగదని మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్, బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ నందునామాజీ అన్నారు. మండలంలోని కోటకొండ గ్రామంలో నిర్వహిస్తున్న రిలేదీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలో కొత్తపల్లి, గుండుమాల్‌ను మండలాలుగా ప్రకటించి అన్ని అర్హతలు ఉన్న కోటకొండను విస్మరించారని అన్నారు. ఇది పక్కా రాజకీయ దురుద్దేశమేనని విమర్శించారు. ఉద్యమించి సాధించుకుంటామన్నారు. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు తాత్కాలికంగా భవనాలు ఉన్నాయని, కొత్త భవన నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలం ఉందని అన్నారు. విద్య, వైద్యం తదితర విషయాల్లో హైస్కూల్, పీహెచ్‌సీలు ఎన్నో సంవత్సరాలుగా నడుస్తున్నాయని చెప్పారు. రాజకీయ పరంగా ఎంతో చైతన్యవంతమైన ప్రాంతమని గుర్తు చేశారు. చుట్టుపక్కల ఎన్నో గ్రామాలకు మధ్యన ఉందని, వెంటనే ఎమ్మెల్యే చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కెంచె శ్రీనివాసులు, బి.రాము, చెన్నప్ప, నర్సింహులు, హన్మంతు, బండగొండ గ్రామస్తులు పాల్గొన్నారు.

వానాకాలం.. ప్రణాళిక సిద్ధం

- జిల్లాలో 4.40లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- అత్యధికంగా పత్తి 2.10 లక్షల ఎకరాల్లో సాగు
- నీటి వసతిని బట్టి లక్ష ఎకరాల్లో వరి
- 47వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమంటున్న అధికారులు



మరికల్ మండలంలో దుక్కి దున్నుతున్న రైతు

నర్వ: వానాకాలం జిల్లా ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. విత్తనాలు, ఎరువులు, యూరియా, పొటాషియం, కాంప్లెక్స్ ఎరువుల అవసరాలను గుర్తించారు. జిల్లాలో ఈ ఏడాది 4.42 లక్షల ఎకరాలలో వివిధ పంటలు సాగవనున్నాయని అధికారులు భావిస్తున్నారు. గత ఏడాదిలాగే ఈసారి కూడా పత్తిపంట అధిక విస్తీర్ణంలో 2.10లక్షల ఎకరాలలో సాగవనుందని అంచనా వేశారు. నీటి వనరులు ఉన్న మాగనూర్, కృష్ణా, మక్తల్, నర్వ, మండలాల్లో, బోరుబావులు, చెరువులు, కుంటలు కలిగిన నారాయణపేట, కోస్గి, మద్దూరు మండలాల్లో వరి ఎక్కువగా సాగు చేస్తారు. లక్షా 60వేల ఎకరాల్లో సాగవనుందని అంచనా వేస్తున్నారు. గతంలో జిల్లాలో అత్యధికంగా సాగైన కందిపంటపై ఈసారి రైతులు అంతగా ఆసక్తి చూపడంలేదు. ఈ వానాకాలంలో 60వేల ఎకరాల్లో సాగవనుందని భావిస్తున్నారు.

ఆశించిన దిగుబడి లేక..

గత ఏడాది రెండు కాలాల్లోనూ (వానాకాలం, యాసంగి) పంటలు ఆశించిన మేర దిగుబడి రాలేదని రైతులు వాపోతున్నారు. అధికారుల అంచనా కూడా తప్పింది. వర్షాలు ఎక్కువగా కురవడంతో వానాకాలంలో చేతికి వచ్చిన పంటలు దెబ్బ తిన్నాయి. యాసంగిలో అకాల వర్షాల కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతినడంతో చేతికందిన పంటలు నేలపాలయ్యాయి.

ఎరువుల ప్రణాళిక ఇలా..

జిల్లాలో మొత్తం 4.42 లక్షల ఎకరాల సాగు కోసం అవసరమైన కాంప్లెక్స్ ఎరువులు, యూరియా, పిటాషియం, విత్తనాలు ఏ మేరకు అవసరమో అంచనాను రూపొందించింది. ఇందులో 47వేల మెట్రిక్ టన్నుల మేర ఎరువులు అవసరమని అంచనా వేసింది. వర్షాధార పంటలకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సకాలంలో రైతులకు అందించేందుకు వ్యవసాయ శాఖ పూర్తిస్థాయి అంచనాలను రూపొందించింది.

పత్తి పంటకు తీవ్ర నష్టం..

గత యాసంగిలో రైతులు సాగు చేసుకున్న పత్తిపంట అకాల వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో దిగుబడి పూర్తిగా తగ్గి రైతన్నకు నష్టం వాటిల్లింది. మరోపక్క బహిరంగ మార్కెట్‌లో పత్తిపంటకు తక్కువ ధర రావడంతో రెండు వైపులా నష్టపోయామని రైతులు వాపోయారు. ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్లు రావాల్సి ఉండగా కేవలం 5నుంచి 6 క్వింటాళ్ల వరకే దిగుబడి రావడంతో రైతులు చాలా నష్టపోయారు. ఇలా పత్తి పంట గత ఏడాది వానాకాలం, యాసంగిలో రైతులకు నష్టాలు మిగిలాయి.

ఈ ఏడాది వానాకాలం పంటల సాగు అంచనా..

పంట	సాగు (ఎకరాలలో)
పత్తి	2.10 లక్షలు
వరి	1.60 లక్షలు
కంది	60 వేలు
మిగిలిన పంటలు	12వేల ఎకరాలు

అవసరమైన విత్తనాలు

పత్తి	4 లక్షల 20వేల ప్యాకెట్లు
వరి	26 వేల క్వింటాళ్లు
కందులు	2,400 క్వింటాళ్లు

ఎరువుల అవసరం ఇలా..

ఎరువులు	మెట్రిక్ టన్నుల్లో
యూరియా	16 వేలు
డీఏపీ	9 వేలు
ఎంఏపీ	5వేలు
కాంప్లెక్స్	16 వేలు
ఇతరములు	1 వెయ్యి

రైతులు సిద్ధం కావాలి..



రానున్న వానాకాలం కోసం రైతులు ఇప్పటి నుండే సిద్ధం కావాలి. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పొలాలను దుక్కి దున్నుకోవాలి. బీడు భూములను బాగా కురిసిన వర్షాలకు దున్నుకోవాలి. వానాకాలంలో వ్యవసాయ శాఖ సూచించిన మేరకు పంటలను సాగు చేసుకోవాలి. పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం అందించేందుకు ప్రణాళిక చేపట్టాం. సకాలంలో సాగుకు రైతులు సమాయత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– జాన్‌సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి

సీఎం కప్ నిర్వహణపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమాచారి

నారాయణపేట రూరల్: క్రీడల ప్రోత్సాహానికి తెలంగాణ ప్రభుత్వం సీఎం కప్‌ను నిర్వహిస్తుందని డీవైఎస్‌ఓ కృష్ణమాచారి అన్నారు. స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లోని యువజన క్రీడలశాఖ కార్యాలయంలో జిల్లా స్థాయిలో సీఎం కప్ నిర్వహణపై ఆదివారం సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, మౌలిక వసతులు ఉన్న ప్రాంతాన్ని ఎంపిక చేయాలన్నారు. కమిటీ సభ్యుల సమక్షంలో కొల్లంపల్లి జెడ్పీ స్కూల్ మైదానాన్ని ఎంపిక చేశారు. ఈనెల 22 నుంచి రెండురోజుల పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన 15 నుంచి 36 ఏళ్లలోపు యువతీ, యువకులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమ ప్రారంభం, ముగింపు సమావేశాలకు కలెక్టర్ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని సదుపాయాలతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అసోసియేషన్, కమిటీ సభ్యులు గోపాలం, అనంతసేన, నర్సింహులు, అంబరీష్, సాయినాథ్ పాల్గొన్నారు.

అరకొరగానే విత్తన రాయితీ

- కేవలం పచ్చిరొట్టపైనే 65 శాతం సబ్సిడీ
- పంపిణీకి సిద్ధంగా మూడు రకాల విత్తనాలు
- వనపర్తి విత్తనశుద్ధి కర్మాగారం నుంచే ఉమ్మడి జిల్లాకు సరఫరా
- ఇప్పటికే ఇండెంట్ సీడ్ కార్పొరేషన్‌కు పంపిన వ్యవసాయశాఖ



వనపర్తిలో విత్తనశుద్ధి కర్మాగారంలో విత్తనాలు

వనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం విత్తన సబ్సిడీని గత మూడేళ్లుగా కేవలం పచ్చిరొట్ట ఎరువులకు మాత్రమే పరిమితం చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో సాగు చేసే వరికి సైతం అన్నదాతకు రాయితీ లభించడం లేదు. తాజాగా ప్రభుత్వం పచ్చిరొట్టకు సంబంధించి మూడు రకాల విత్తనాలపై 65 శాతం రాయితీ ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర విత్తనశుద్ధి కార్పొరేషన్ సంస్థ నుంచి రైతులకు కావాల్సిన విత్తనాలను శుద్ధిచేసి ఏటా.. వానాకాలం, యాసంగి సీజన్‌లలో పంపిణీ చేస్తారు. ఈసారి వానాకాలం సీజన్‌కు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఆయా రకాల పంటలు, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను వనపర్తిలోని విత్తనశుద్ధి కర్మాగారంలో శుద్ధి చేసి సిద్ధంగా ఉంచారు.

వానాకాలం సీజన్ నాటికి..

మహబూబ్‌నగర్‌లోని ఐదు జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చిన ఇండెంట్ ప్రకారం ఆయా రకాల విత్తనాలను సిద్ధం చేశారు. జూన్ మొదటి వారం నుంచి వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న సందర్భంగా పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను ఆయా జిల్లాలకు పంపించే ఏర్పాట్లు సీడ్స్ కార్పొరేషన్ అధికారులు చేస్తున్నారు. ప్రస్తుతం వనపర్తిలోని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ కర్మాగారంలో వరిలో నాలుగు రకాల విత్తనాలు, వేరుశనగలో రెండు రకాల విత్తనాలతోపాటు కంది విత్తనాలను శుద్ధి చేశారు. వీటితోపాటు పచ్చిరొట్టలోని మూడు రకాల విత్తనాలను సిద్ధం చేసి 30 కిలోల పాకెట్లుగా చేసి ఉంచినట్లు అధికారులు వెల్లడించారు.

ధర, సబ్సిడీ ఇలా..

జీలుగ, జనుము, పిల్లిపెసర మూడు రకాల పచ్చిరొట్ట (30 కిలోల) ఎరువులను ఆయా జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చిన ఇండెంట్ మేరకు సిద్ధం చేశారు.



విత్తనాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న వాహనాలు

విత్తనం	మొత్తం ధర	సబ్సిడీ	రైతు చెల్లించాల్సింది (రూ.లలో..)
జీలుగ	2,407	1,564	842
జనుము	3,500	2,270	1,224
పిల్లిపెసర	2,010	1,306	703

జిల్లాల వారీగా పెట్టిన ఇండెంట్ క్వింటాళ్లలో..

జిల్లా	జీలుగ	జనుము	పిల్లిపెసర
మహబూబ్‌నగర్	1,700	170	-
నారాయణపేట	1,480	-	-
వనపర్తి	955	4	4
గద్వాల	680	-	-
నాగర్‌కర్నూల్	600	140	-

అందుబాటులో ఉన్న ఆయా రకాల విత్తనాలు

విత్తన రకం	నిల్వ ఉన్న స్టాక్ (క్వింటాళ్లలో..)
జీలుగ	5,400
జనుము	320
పిల్లిపెసర	4
వరి బీపీటీ స్వర్ణమసూరి	5,751
వరి జేజీఎల్-24423	500
వరి కేఎన్‌ఎం- 118	1,964
వరి ఎంటీయూ- 1010	3,809
వేరుశనగ కె-6	2,512
వేరుశనగ (లేపాక్షి)	1,019
కంది పీఆర్‌జీ-176	400



ఇండెంట్ తీసుకుని..



2020 సంవత్సరానికి ముందు పచ్చిరొట్ట ఎరువులతోపాటు అన్ని రకాల విత్తనాలకు ప్రభుత్వం రాయితీ ఇచ్చేది. కానీ, మూడేళ్లుగా కేవలం పచ్చిరొట్ట ఎరువులకు మాత్రమే సబ్సిడీ లభిస్తోంది. రాయితీ ఉన్న విత్తనాల విషయంలోనే ఆయా జిల్లా వ్యవసాయశాఖ అధికారుల నుంచి ఇండెంట్ తీసుకుని విత్తనాలను సిద్ధం చేస్తాం. వరి, వేరుశనగ, కంది వంటి విత్తనాలకు రాయితీ లేదు కాబట్టి ఓపెన్ మార్కెట్ లెక్కనే విక్రయాలు ఉంటాయి.

– రాజీవ్, ఆర్ఎం, తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, మహబూబ్‌నగర్

పోలీసులు నిబద్ధతతో పనిచేయాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ



హాజరైన హోంగార్డులు

నారాయణపేట రూరల్: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల బాధ్యత అని, ప్రతి హోంగార్డు నిబద్ధతతో తన విధులు నిర్వహించాలని డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం హోంగార్డు దర్బార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ హాజరై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను వివరించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విభాగాల పోలీసుల సమస్యల పరిష్కారానికి ఎస్పీ ఎంతో కృషి చేస్తున్నారని, హోంగార్డుల ఇబ్బందులను తెలియజేసి వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించే సమయంలో ఎంతో పారదర్శకతతో ఉండాలని, ప్రతి ఒక్కరితో మర్యాదగా మాట్లాడి వారి భయాన్ని పోగొట్టాలన్నారు. క్రమశిక్షణ, సమయపాలన ఎంతో ముఖ్యమైనవని, నిజాయితీ కలిగి ఉండాలన్నారు. బాధ్యతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్యూటీతో పాటు కుటుంబానికి సమయం కేటాయించాలని, పిల్లల ఆలన, చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. వృద్ధులైన తల్లిదండ్రులు ఉంటే వారిని జాగ్రత్తగా చూసుకోవాలని, రాబోవు తరానికి పోలీసుల పిల్లలు రోల్ మాడల్‌గా ఉండేలా పెంచాలన్నారు. కుటుంబంలో తలెత్తే చిన్నచిన్న సమస్యలను ఎక్కువగా ఆలోచించి టెన్షన్‌కులోను కారాదని, ప్రశాంత వాతావరణంలో వాటి పరిష్కారానికి ముందుడుగు వేయాలన్నారు. ప్రతిరోజు యోగా, వాకింగ్ వంటి వాటికి సమయం కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ డేవిడ్ విజయ్‌కుమార్, కృష్ణయ్య, ఆర్ఎస్ఐ ఇందిరా, జిల్లాలోని హోంగార్డ్స్ పాల్గొన్నారు.

బీజేపీతోనే సమస్యల పరిష్కారం



చెంచులనుద్దేశించి మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే

చెంచులతో ఆత్మీయ సమ్మేళనంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే

మన్ననూర్: డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అన్ని రకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల లోతట్టు ప్రాంతం భౌరాపూర్ సమీప చెంచుపెంటలోని చెంచులతో బీజేపీ పార్లమెంట్ ప్రవాస్ యోజన ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి చెంచులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. విద్య, ఉపాధి, ఇళ్లు, తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా చెంచులు మంత్రికి దృష్టికి తెచ్చారు. పాలకులు పోడు భూములకు పట్టాలు ఇవ్వడం లేదని, అనారోగ్యం బారినపడినప్పుడు రవాణ సౌకర్యం లేక అడవుల్లో ఎన్నో తిప్పలు పడుతున్నామని అప్పాపూర్ సర్పంచ్ బాలగురువయ్య, చెంచుపెద్దలు మల్లయ్య, గురువయ్య, లింగయ్య, శివమ్మ వాపోయారు. అచ్చంపేట బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ సతీష్ మాదిగ మాట్లాడుతూ గత 70 ఏళ్లుగా చెంచుల జీవన విధానం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. నిరుద్యోగ సమస్య అధికంగా ఉన్న నల్లమల ప్రాంతం ఎన్నో వనమూలికలకు ప్రసిద్ధి అని, ఇక్కడ ఆయుర్వేద రీసెర్చ్ సెంటర్ వంటిది ఏర్పాటు చేస్తే చెంచులకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. స్పందించిన మంత్రి కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం అంటే బీజేపీ పాలన ఉన్నట్లయితే ఇలాంటి సమస్యలన్నీ పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈసారి తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతిఒక్కరు కృషిచేయాలని మంత్రి సూచించారు. గవర్నర్ తమిళిసై దత్తత తీసుకున్న ఈ పెంటల్లోని చెంచుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సైతం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, నాయకులు మంగ్యానాయక్, శ్రీకాంత్ భీమా, మాధవి, పర్వతాలు, కొండల్‌రెడ్డి, నాగరాజు, నరేందర్, శ్రీను, వాల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం

నవాబుపేట: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో కాంగ్రెస్సే ఎక్కువ అసెంబ్లీ స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పీపుల్స్ పాదయాత్ర చేపట్టి వడదెబ్బతో మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం రుక్కంపల్లిలో విశ్రాంతి తీసుకుంటున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను ఆదివారం ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమకుమార్, ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఆర్థిక వ్యవస్థను, సంపదను సర్వనాశనం చేశాయన్నారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకొంటున్న బీజేపీకి కర్ణాటకలో ట్రబుల్ ఏర్పడిందని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన సోనియాగాంధీ లక్ష్యం ప్రజలకు వివరించి రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేలా పనిచేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు కావాల్సిన అవసరాలను తీర్చే విధంగా సరికొత్త మేనిఫెస్టో రూపొందించి ముందుకెళ్తామన్నారు.



మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కనే భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు తదితరులు

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

భట్టి విక్రమార్క విరామ శిబిరం చెంతనే ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ చొరవతోనే నేడు దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని అభివర్ణించారు. ఆయా కార్యక్రమాల్లో పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, కాంగ్రెస్ ఐటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మదన్‌మోహన్‌రావు, మాజీ ఆర్గనైజింగ్ ప్రసిడెంట్ సుకుమార్, ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మరో రోజు విరామం

పీపుల్స్ పాదయాత్ర చేస్తూ అస్వస్థతకు గురైన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సోమవారం సైతం విరామం తీసుకుంటారని యాత్ర ఇన్‌చార్జ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం భట్టిని పరీక్షించిన వైద్యబృందం సోమవారం సైతం విరామం తీసుకోవాలని సూచించారని ఆయన వివరించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యుదాఘాతానికి గురై వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండలంలోని గన్యాగులలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన లింగమ్మ (58) ఇంట్లో విద్యుత్ తీగలను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది.

గుడిసె కూలి మహిళ..


పద్మమ్మ (ఫైల్)

వనపర్తి: గాలివాన బీభత్సానికి గుడిసె కూలి ఓ మహిళ మృతిచెందిన ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని కిష్టగిరి శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. పొలం వద్ద పనిచేస్తున్న పద్మమ్మ (48), భర్త కురుమయ్య సాయంత్రం వీచిన గాలివానకు గుడిసెలోకి వెళ్లారు. గాలి ఉధృతి ఎక్కువై గుడిసె కూలి పోవటంతో కర్రలు పైనపడి పద్మమ్మ మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు చిన్నారుల మృతి

- వడదెబ్బతోనే చనిపోయారంటున్న గ్రామస్తులు


రమేష్, శివ (ఫైల్)

బాలానగర్: మండలంలోని చిన్నరేవల్లికి చెందిన ఇద్దరు చిన్నారులు ఆదివారం మృతిచెందారు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బైరమోని జంగయ్య కుమారులు రమేష్ (12), శివ (10) శనివారం రాత్రి భోజనం చేసి పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో కడుపులో నొప్పి వస్తుందని శివ తండ్రికి చెప్పగా ఉదయం ఆస్పత్రికి వెళ్దామని చెప్పి నిద్రపుచ్చాడు. కాసేపటికే వాంతులు కావడంతో ఆదివారం తెల్లవారుజామున షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా శివ మృతి చెందగా.. హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా రమేష్ (12) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తల్లి 9 ఏళ్ల క్రితమే మృతిచెందిందని.. వడదెబ్బతోనే చిన్నారులు మృతిచెంది ఉంటారని గ్రామస్తులు వివరించారు.

నలుగురిపై కేసు నమోదు

అడ్డాకుల: పొన్నకల్‌కు చెందిన అల్తాఫ్, రాచాలకు చెందిన శ్రీకాంత్, కందూర్‌కు చెందిన హరీశ్‌తో పాటు మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లికి చెందిన శివ శనివారం రాత్రి భోజనం చేయడానికి శాఖాపూర్ వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న హోటల్‌కు వెళ్లారు. బిర్యానీ తేవాలని వెయిటర్ పరమేష్‌కు చెప్పగా లేదని సమాధానం ఇవ్వడంతో నలుగురు కలిసి దాడి చేశారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు ఆదివారం నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మన్యం వివరించారు.

ఆర్చరీ కేరాఫ్ పాలమూరు

- రాణిస్తున్న జిల్లా క్రీడాకారులు
- రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు

లోకల్ టాలెంట్


శిక్షణలో సుజాత

మహబూబ్‌నగర్ క్రీడలు: వ్యక్తిగత క్రీడాంశాల్లో ఆర్చరీ (విలువిద్య)కు ప్రత్యేక స్థానం ఉంది. ఈ క్రీడలో పాల్గొనేవారు కూడా అరుదుగా ఉంటారు. ఖర్చుతో కూడిన క్రీడకావడంతో చాలామంది అంతగా ఆసక్తి కనబర్చడం లేదు. అలాంటి అరుదైన క్రీడలో రాణిస్తున్నారు జిల్లా క్రీడాకారులు. కోచ్ జ్ఞానేశ్వర్ వద్ద శిక్షణ తీసుకొని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతున్నారు.

గిరిజన బిడ్డ.. ఆర్చరీలో దిట్ట...

మారుమూల గిరిజనతండాకు చెందిన ఆర్.సుజాత రాథోడ్ ఆర్చరీలో ప్రతిభ చాటుతూ అందరి మన్ననలు పొందుతోంది. హన్వాడ మండలం రాంనాయక్‌తండాకు చెందిన సుజాత ఐదేళ్లుగా కోచ్ జ్ఞానేశ్వర్ వద్ద శిక్షణ తీసుకుంటూ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని రాణిస్తుంది. ఇప్పటి వరకు 15కుపైగా రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించి పలు పతకాలు సాధించింది. అస్సాం (గౌహటి)లో 2018లో వనవాసి కళ్యాణ పరిషత్ జాతీయస్థాయి పోటీలో.. ఇదే ఏడాది మహారాష్ట్ర (నాగ్‌పూర్)లో జరిగిన మెహ్రికప్ జాతీయస్థాయి టోర్నీలో పాల్గొంది. 2019లో ఆంధ్రప్రదేశ్ కడపలో జరిగిన స్కూల్ గేమ్స్, మహారాష్ట్రలో సబ్ జూనియర్ నేషనల్ పోటీల్లో పాల్గొంది. 2021 ఝార్ఖండ్ (జంషెడ్‌పూర్)లో జరిగిన సీనియర్ నేషనల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున ఆడింది. సుజాత ఉమ్మడి జిల్లా నుంచి సీనియర్ నేషనల్ పోటీలకు ఎంపికైన తొలి క్రీడాకారిణి కావడం విశేషం. అదే ఏడాది మహారాష్ట్ర (న్యూ అమరావతి)లో జరిగిన సబ్ జూనియర్ నేషనల్ పోటీల్లో ఇండియన్ రౌండ్ విభాగంలో 6వ స్థానంలో నిలిచింది. 2022లో రాజస్థాన్‌లో సబ్ జూనియర్, జమ్మూకశ్మీర్‌లో జరిగిన సీనియర్ నేషనల్ పోటీల్లో పాల్గొంది. అదే ఏడాది మార్చిలో గుజరాత్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. సుజాత ప్రస్తుతం కంపౌండ్‌లో ప్రాక్టీస్ చేసింది. ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిథ్యం వహించడమే తన లక్ష్యమంటుంది సుజాత.

ఒకే టోర్నీలో మూడు పతకాలు..

2021లో హైదరాబాద్ హకీంపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సుజాత మెరుగైన ప్రతిభ కనబర్చింది. అండర్ – 14 ఇండియన్ రౌండ్ విభాగంలో బంగారు, అండర్–17లో రజతంతో పాటు సీనియర్ విభాగంలో రజత పతకం సాధించింది. ఒకే టోర్నీలో మూడు విభాగాల్లో పతకాలు సాధించి సత్తా చాటింది. టోర్నీలో సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్రంలోనే 335 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది.

చిన్నారి శ్రీహిత సైతం..

ఏడేళ్ల వయసున్న శ్రీహిత రెండేళ్ల నుంచి ఆర్చరీలో శిక్షణ తీసుకుంటూ రాణిస్తుంది. అండర్–9 విభాగంలో తన చిట్టి చేతులతో లక్ష్యాన్ని గురిచూసి విల్లు సంధించింది. 2021లో హైదరాబాద్ గచ్చిబౌలీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంది. 2022లో కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో అండర్–9 విభాగం కంపౌండ్ రౌండ్‌లో బంగారు పతకం సాధించింది. ఈ ఏడాది జనవరిలో విజయవాడలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో అండర్–9 విభాగం కంపౌండ్ రౌండ్‌లో పాల్గొని ఏడో ర్యాంకు సాధించడం విశేషం. మెయిన్ స్టేడియంలో రోజు ఉదయం, సాయంత్రం కోచ్ జ్ఞానేశ్వర్ వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటుంది.



ప్రతిభ చాటుతున్న మణికంఠ..



జిల్లాకేంద్రంలోని ఏనుగొండకు చెందిన మణికంఠ 9 ఏళ్ల నుంచి ఆర్చరీలో శిక్షణ తీసుకుంటూ ప్రతిభ చాటుతున్నారు. 2014లో శిక్షణ ప్రారంభించిన మణికంఠ పలు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. 14 సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిథ్యం వహించారు. రాష్ట్రస్థాయిలో రెండు రజత, రెండు కాంస్య పతకాలు సాధించారు. 2016లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–14, 2018లో విజయవాడలో, 2019లో ఝార్ఖండ్‌లో ఎస్‌జీఎఫ్ అండర్–17 విభాగం, అదే ఏడాది మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీలో పాల్గొన్నారు. జేఎన్‌యూటీ తరఫున 2022లో పంజాబ్ (మొహాలి), 2023లో భటిండాలో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్నారు. కంపౌండ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న మణికంఠ అంతర్జాతీయస్థాయిలో ఆడడమే తన లక్ష్యమంటున్నారు.

పిడుగుపడి యువరైతు మృతి

- తండ్రి పరిస్థితి విషమం

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండకు చెందిన యువ రైతు పాపకంటి రమేష్ (24) పిడుగుపాటుకు గురై మృతిచెందగా.. తండ్రి పాపకంటి నాగయ్య పరిస్థితి విషమంగా ఉంది. ఈ దుర్ఘటన ఆదివారం సాయంత్రం ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నాగయ్య ఖానాపూర్‌లో 5 ఏకరాల భూమి కౌలుకు తీసుకొని యాసంగిలో వరి పంట సాగు చేశారు. ఆదివారం వరి పంట కోత కోసం నాగయ్య, రమేష్‌తో పాటు అల్లుడు కృష్ణ పొలానికి వెళ్లారు. సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో ముగ్గురుతో పాటు మరోవ్యక్తి తల దాచుకోవడానికి ట్రాక్టర్ దగ్గరికి వెళ్లారు. అదే సమయంలో రమేష్‌కు ఫోన్ రావడంతో మాట్లాడుతుండగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందగా నాగయ్య, కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక రైతులు క్షతగాత్రులను వెంటనే నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నాగయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా.. కృష్ణ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు వెల్లడించారు.

చిరుత దాడిలో మేక మృతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో చిరుత దాడి చేయడంతో మేక మృతిచెందింది. గ్రామస్తుల కథనం మేరకు.. మొలచింతలపల్లి సమీపంలో ఉన్న చెంచుగూడెం గ్రామానికి చెందిన చెంచు రమేష్ ఆదివారం సాయంత్రం మేకలను మేపడానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతానికి వెళ్లారు. చిరుత మేకను పట్టుకొని తీసుకెళ్తుండగా కాపరి గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న కుక్కలు చిరుతను అడ్డుకోవడంతో అక్కడే వదిలి పారిపోయింది. చిరుతను ప్రతిఘటించడంతో కుక్కకు కూడా గాయాలయ్యాయి. ఫారెస్టు అధికారులు స్పందించి కాపరికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎట్టకేలకు కదలిక

మొదలు కానున్న తుమ్మిళ్ల రెండో దశ పనులు

- స్వల్ప మార్పులతో మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం
- రూ.400 కోట్ల నుంచి రూ.490 కోట్ల వ్యయానికి పెంపు
- 1.02 టీఎంసీల సామర్థ్యం
- పూర్తయితే 50వేల ఎకరాలకు పైగా సాగునీరు అందే అవకాశం

రాజోళి: తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలోని కీలకమైన రిజర్వాయర్ల నిర్మాణంలో రెండవ దశ పనులకు కదలిక రావడంతో ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కాలంగా ఎండిన భూములకు సాగు నీరందించేందుకు నిర్మించిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలో రిజర్వాయర్లదే ప్రధాన భూమిక. అందులో మల్లమ్మ కుంట నిర్మాణం మరింత అవసరమైనదిగా ఆది నుండే రైతులు, అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో మొదటి దశలో పైప్‌లైన్ ద్వారా నీరందించిన అధికారులు మల్లమ్మకుంటపై కొంత మౌనం పాటించడంతో దాని నిర్మాణంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో గత నెల 26న ప్రభుత్వం మల్లమ్మకుంట నిర్మాణానికి సంబంధించిన అనుమతి లెటర్ రావడంతో ఆయకట్టు రైతుల్లో సంతోషం నెలకొంది.



తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం

రెండోదశలో భాగంగా..

ఎత్తిపోతల పథకంలో మొదటి దశలో భాగంగా నది నుంచి అప్రోచ్ కెనాల్, ఫోర్ బే, పంప్ హౌజ్, 7 కిమీ మేర డబుల్ పైప్‌లైన్ నిర్మించారు. ఈ పైప్‌లైన్‌తో డి–23 వద్ద గల డెలవరీ సిస్టర్న్ ద్వారా ఆర్డీఎస్ కెనాల్‌లోకి తుంగభద్ర నది నుంచి నీరు వదిలి ఆయకట్టుకు అందిస్తున్నారు. కానీ దీని ద్వారా చివరి ఆయకట్టు వరకు పూర్తి స్థాయిలో నీరందక రైతులు పంటలు ఎండుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మల్లమ్మకుంట నిర్మాణానికి డిమాండ్ పెరిగింది. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు సాగునీటి శాఖ అధికారులు రైతుల విజ్ఞప్తిని ప్రభుత్వానికి తెలియచేయడంతో స్పందించిన ప్రభుత్వం మల్లమ్మకుంట నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ, అనుమతి లెటర్ పంపింది. ఇకపై రెండవ దశలో భాగంగా ఈ మల్లమ్మ కుంట పనులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

పెరిగిన వ్యయం.. స్వల్ప మార్పులు

2022లోనే మల్లమ్మ కుంట నిర్మాణం కోసం అధికారులు రూ.400 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ దానిపై ఎలాంటి కదలిక రాలేదు. తాజాగా గత నెల 25న రూ.490 కోట్లతో ప్రతిపాదనలు పంపగా అనుమతులు లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిర్మించేందుకు రూ.400 కోట్ల ఖర్చును లెక్క చేసిన అధికారులు తాజాగా నిర్మించేందుకు రూ.90 కోట్లు అదనంగా ఖర్చు అయ్యే అవకాశమున్నట్లు చెబుతున్నారు. పెరిగిన ముడి సరుకుల ధరలు, టెక్నికల్ ఖర్చులు, కూలీలు, సిబ్బంది జీతాలు, డీజిల్, పెట్రోల్ ధరల పెరుగుదల, యంత్రాల నిర్వహణ తదితర ఖర్చుల పరంగా ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా తుమ్మిళ్ల ఎత్తిపోతల నిర్మించేందుకు రూపొందించిన డీపీఆర్ ప్రకారం మల్లమ్మ కుంట 0.98 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాల్సి ఉండగా, తుమ్మిళ్ల పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు దాన్ని 1.02 టీఎంసీల సామర్థ్యానికి పెంచారు. చివరి ఆయకట్టు వరకు నీరందించాలంటే రిజర్వాయర్ సామర్థ్యం పెంచాలని సూచించిన మేరకు అదే విధంగా నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. లిఫ్ట్ నుంచి 10 కి.మీ. మేర పైప్‌లైన్ వేసి రిజర్వాయర్‌కు నీరు తరలించాల్సి ఉంటుంది.

త్వరగా పూర్తి చేయాలి



మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మిస్తేనే తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం సార్థకం అవుతుంది. ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందించాలంటే ఈ రిజర్వాయర్ తప్పనిసరి కాగా, ఇప్పటికే నిర్మాణంలో ఆలస్యం జరిగింది. ఇకనైనా ఎలాంటి జాప్యం జరగకుండా నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి.అప్పుడే రైతులకు మేలు జరుగుతుంది. రిజర్వాయర్ నిర్మాణం తాత్కాలిక ఉపశమనం కాకుండా శాశ్వత ప్రయోజనమిచ్చేలా నిర్మించాలి.

– వెంకట్రామన్, రైతు, శాంతినగర్

రూ.90కోట్లు పెంచి ప్రతిపాదనలు..

ప్రభుత్వం నుంచి మల్లమ్మ కుంటకు అనుమతి లెటర్ రాకముందే ప్రతిపాదనలు పంపాం. గతంలో రూ.400 కోట్లకు పంపగా, పెరిగిన ధరలు కారణంగా రూ.90 కోట్లు అదనంగా కలిపి ప్రతిపాదనలు పంపించాం. దానికే అనుమతి లెటర్ వచ్చింది. ముందుగా అనుకున్న ప్రకారం కాకుండా సీఎం కేసీఆర్ పర్యటన చేసిన అనంతరం సూచించిన సలహాల మేరకు నిర్మాణం చేపడుతున్నాం.

– విజయ్ కుమార్‌రెడ్డి, ఈఈ, గద్వాల

రిజర్వాయర్ నిర్మాణానికి 568 ఎకరాల భూమి

మల్లమ్మకుంట నిర్మాణం కోసం 568 ఎకరాల భూమిని గుర్తించారు. అందులో భాగంగా ఆయా సర్వే నెంబర్లపై సర్వే నిర్వహించి, ఎస్‌డీసీ కార్యాలయానికి కూడా వివరాలు పంపారు. ఇప్పటికే మొదటి దశ పనులు పూర్తి కాగా, రెండవ దశలో చేపట్టే మల్లమ్మ కుంట పనులు త్వరగా ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే, వర్షాకాలంలో నీటిని ఒడిసిపట్టుకోవడమే కాకుండా, తుంగభద్ర నదిలో వరద ఉన్న సమయంలో నీటిని తరలించి నిల్వ ఉంచుకునే వీలుంటుంది. తద్వారా గడ్డు కాలంలో ఆయకట్టు ఎండిపోకుండా కాపాడుకునే అవకాశముంటుంది. ప్రస్తుతం పూర్తి అయిన మొదటి దశ పనుల ద్వారా కేవలం పైప్‌లైన్ నుంచి నీరు ఆయకట్టుకు అందిస్తున్నప్పటికీ, నీటిని నిల్వ చేసుకునే అవకాశం లేక, వరద నీటిని,వర్షపు నీటిని స్టోరేజీ చేసుకోలేకపోతున్నామని వాదనలు ఉన్నాయి. మల్లమ్మ కుంట రిజర్వాయర్ పూర్తి అయితే ఆర్డీఎస్ కెనాల్ పరిధిలోని 50వేల ఎకరాలకు పైగా సాగు నీరు అందనుంది. ఎట్టకేలకు చిన్నపాటి మార్పులతో మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి రావడం పట్ల రైతులు ఆనందంగా ఉండటంతో పాటు నిర్మాణం త్వరగా పూర్తి చేసి శాశ్వత ప్రయోజనాన్ని ఆయకట్టుకు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం


రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు


కొల్పూర్ గోపాల్ (ఫైల్)

మాగనూర్: లారీ ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుందని ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన కొల్పూర్ గోపాల్ (26) బైక్‌పై బస్టాండ్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా మక్తల్ నుంచి రాయచూర్ వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సుమిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు. గోపాల్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

గ్రామస్తుల రాస్తారోకో..

యువకుడి మృతికి లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో పాటు రహదారి కాంట్రాక్టర్ ముందుచూపు లేకపోవడం ప్రధాన కారణమని.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్తులు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. బస్టాండ్ చౌరస్తా యూటర్న్‌లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో నెలరోజుల వ్యవధిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో పాటు 10 మందికిపైగా వికలాంగులుగా మారారన్నారు. గతంలో ప్రమాదాలు జరిగినప్పుడు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసినా ఫలితం లేదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి స్పీడ్ బ్రేకర్లు వేయించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో ఇరువైపులా భారీసంఖ్యలో వాహనాలు నిలిచి పోయాయి. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న సీఐ సీతయ్య వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో చివరకు ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్‌ను పిలిపించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మరో ప్రమాదంలో వృద్ధుడు..

వంగూరు: నల్గొండ జిల్లా డిండి మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని ఉమ్మాపూర్‌కు చెందిన కొత్తూరు బాల్‌లింగయ్య (60) మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయని.. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు వివరించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

వనపర్తి: జిల్లా పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసే శివకుమార్ (22) తిరుమలాయగుట్ట అటవీ ప్రాంతంలో ఉరేసుకొని మృతిచెందిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. హెడ్ కానిస్టేబుల్ ఉమేష్ కథనం ప్రకారం.. శివకుమార్‌కు కుటుంబ సభ్యులతో కొంతకాలంగా తగాదాలున్నాయి. దీంతో మనస్తాపానికి గురై శుక్రవారం మధ్యాహ్నం తర్వాత బైక్‌పై తిరుమలాయగుట్ట సమీపానికి వెళ్లి ఉరేసుకొన్నాడు. శనివారం అటుగా వెళ్లిన అటవీశాఖ కూలీలు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. భార్య సాయిలక్ష్మి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. శివకుమార్‌కు ఏడాది వయసున్న పాప ఉంది.

రంగాపూర్‌లో యువకుడు..

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్‌లో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగు చూసింది. ఎస్ఐ జగదీశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన హన్మంతు మనువడు లక్ష్మీనాయుడు (20)తో కలిసి శనివారం పెబ్బేరు సంతకు వచ్చి కోళ్లను విక్రయించి ఉదయం 11 గంటల ప్రాంతంలో గ్రామానికి చేరుకున్నారు. స్నేహితుడు వస్తున్నాడని.. ఇంటికి వెళ్లమంటూ తాతను పంపించి గ్రామ సమీపంలో ఉన్న తోట పంపులో ఉరేసుకున్నాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో ఎక్కడ చూసినా ఆచూకీ లభించలేదు. ఆదివారం అటుగా వెళ్తున్న బాటసారులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. లక్ష్మీనాయుడు ఐటీఐ చదువుతున్నాడని.. అతడి మృతిపై అనుమానం ఉందని తాత ఫిర్యాదు మేరకు ఆదివారం కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జడ్చర్ల ఎర్రమన్నుగుట్టకాలనీలో..

జడ్చర్ల: స్థానిక ఎర్రమన్నుగుట్ట కాలనీలో ఉంటున్న ఓ మహిళ ఆదివారం ఉరేసుకొని మృతి చెందిందని ఎస్ఐ లెనిన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఉదండాపూర్‌కు చెందిన చెరువుమీది యాదమ్మ (30) బాదేపల్లిలోని ఎర్రమన్నుగుట్టలో ఓ ఇంటిని కొనుగోలు చేసి ముగ్గురు పిల్లలతో అక్కడే ఉంటుంది. భర్త పర్వతాలు రెండేళ్ల కిందట మృతిచెందడంతో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుండేది. ఈ క్రమంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని, నవాబుపేట మండలం కూచూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతికి కారణమని తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

భారీ మొసలి లభ్యం


మొసలితో కృష్ణసాగర్, గ్రామస్తులు

కొత్తకోట: మండలంలోని అప్పరాల శివారులో ఉన్న రామన్‌పాడు ఎడమ కాల్వలో భారీ మొసలిని ఆదివారం గ్రామస్తులు గుర్తించారు. ఈ విషయాన్ని సర్పంచ్ హిమబిందుకు తెలుపగా ఆమె స్నేక్ క్యాచర్ కృష్ణసాగర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే కాల్వ దగ్గరకు చేరుకున్న కృష్ణసాగర్ గ్రామస్తులు, రైతుల సహకారంతో మొసలిని పట్టుకున్నారు. మొసలి మూడు ఫీట్ల పొడవు, 180 కిలోల బరువు ఉందని తెలిపారు. డీఎఫ్ఓ నవీన్‌కుమార్‌రెడ్డి సూచన మేరకు జూరాల డ్యాంలో వదిలినట్లు కృష్ణసాగర్ తెలిపారు. శంకర్‌నాయుడు, యువకులు తదితరులు ఉన్నారు.

డీజిల్ చోరీ

జడ్చర్ల: టిప్పర్ నుంచి దాదాపు 150 లీటర్ల డీజిల్ చోరీకి గురైందని యజమాని ఎండీ ఖాజా ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. టిప్పర్‌ను మరమ్మతు నిమిత్తం శనివారం వనపర్తి నుంచి జడ్చర్లకు డ్రైవర్ జగదీశ్ తీసుకొచ్చారు. తిరిగి వనపర్తికి రాకపోవడంతో అనుమానం వచ్చి ఆదివారం వచ్చి చూడగా నిమ్మబాయిగడ్డ ప్రాంతంలో కనిపించిందని, వెళ్లి చూడగా ట్యాంకులో డీజిల్ లేదని.. దీనికి డ్రైవర్ జగదీశ్ కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు

జడ్చర్ల: మండలంలోని ఆల్వాన్‌పల్లి నుంచి గంగాపూర్‌కు వెళ్లే రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్షుల కథనం మేరకు.. మండలంలోని గోప్లాపూర్‌కు చెందిన జగన్ బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే చికిత్స నిమిత్తం బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బందరు పోర్టు పనులకు
నేడే శుభారంభం

● రూ.5,156 కోట్లతో నిర్మాణ పనులకు సీఎం జగన్ భూమిపూజ

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయవాడ: మచిలీపట్నం ప్రజల దశాబ్దాల కలను నెరవేరుస్తూ రూ.5,156 కోట్ల వ్యయంతో చేపడుతున్న పోర్టు నిర్మాణ పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ప్రారంభించనున్నారు. భూసేకరణ పూర్తిచేసి, అన్ని అనుమతులు సాధించి, న్యాయ వివాదాలు పరిష్కరించి, టెండర్లు ఖరారుచేసి, ఫైనాన్షియల్ క్లోజర్ పూర్తి చేసి కొబ్బరికాయ కొట్టిన తర్వాత పనులు ఆగకుండా శరవేగంగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను సిద్ధంచేసింది. పూర్తిగా ప్రభుత్వ వ్యయంతో నిర్మిస్తున్న ఈ పోర్టు రాకతో వాణిజ్య కార్యకలాపాలు విస్తరించి రానున్న కాలంలో కృష్ణాజిల్లా ముఖచిత్రం మారనుంది. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో నవశకానికి నాంది పలుకుతూ అధికారంలోకి వచ్చిన కేవలం నాలుగేళ్ల లోపే మరో నాలుగు పోర్టుల నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రామాయపట్నం, కాకినాడ గేట్‌వే పోర్టుల్లో పనులు శరవేగంగా జరుగుతుండగా, మూలపేట పోర్టు పనులు కూడా ఇటీవలే ప్రారంభమయ్యాయి. ఇక సోమవారం నుంచి ఈ జాబితాలో మచిలీపట్నం పోర్టు కూడా చేరనుంది. 35.12 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో రెండు జనరల్ కార్గోకు, ఒకటి బొగ్గుకు, మరొకటి మల్టీపర్పస్–కంటైనర్‌తో ఎగుమతి, దిగుమతులకు ఉపయోగపడేలా మొత్తం నాలుగు బెర్తులతో మచిలీపట్నం పోర్టును 24–30 నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పోర్టు పనుల పూర్తితో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మందికి ఉపాధి లభించనుంది. ఈ పోర్టు ద్వారా రాష్ట్రంలోని గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు తెలంగాణలోని ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ, వరంగల్ జిల్లాలకు ఎరువులు, బొగ్గు, వంటనూనె, కంటైనర్ల దిగుమతులు, వ్యవసాయ ఉత్పత్తులు, సిమెంట్, సిమెంట్ క్లింకర్, గ్రానైట్, ముడి ఇనుము ఎగుమతులకు వేదికగా మారనుంది. సుమారు రూ.16,000 కోట్ల వ్యయంతో రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే, మూలపేట పోర్టుల నిర్మాణాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 75 వేల మందికి ఉపాధి లభించనుంది.


పోర్టు నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భూమిపూజ చేసే ప్రాంతం

పారిశ్రామిక దూకుడు!


శరవేగంగా పూర్తవుతున్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్

ఏపీ ప్రభుత్వ కృషికి అవార్డుతో జాతీయ స్థాయిలో గుర్తింపు
మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ అడుగులు

- కొత్తగా 4 పోర్టు నగరాలు రామాయపట్నం, మూలపేట, కాకినాడ, బందరు
- వీటికి అదనంగా మినీ పోర్టుల తరహాలో తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం
- పోర్టులను ఆనుకుని పారిశ్రామిక పార్కుల అభివృద్ధి
- పరిశ్రమలకు 80% ఉత్పత్తి వ్యయం తగ్గేలా రూ.18,897 కోట్లు వెచ్చిస్తున్న సర్కార్
- అనుమతులు, ఆర్థిక వనరులు సిద్ధమయ్యాకే పక్కాగా పనులు ప్రారంభం
- మూడు పారిశ్రామిక కారిడార్లు కలిగిన ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రికార్డు
- ప్రభుత్వ తోడ్పాటుతో రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొస్తున్న దిగ్గజ కంపెనీలు
- విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులే నిదర్శనం

సాక్షి, అమరావతి: పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనలో ఏపీ వేగంగా దూసుకెళుతోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా మూడు పారిశ్రామిక కారిడార్లతోపాటు 974 కి.మీ సుదీర్ఘ తీర ప్రాంతాన్ని కలిగి ఉండటం లాంటి అనుకూలతలను అందిపుచ్చుకుంటూ పురోగమిస్తోంది. విద్యుత్, నీరు, రోడ్లు, లాజిస్టిక్స్‌తో పాటు వివాద రహితంగా అభివృద్ధి చేసిన భూములను సమకూర్చడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలనిస్తున్నాయి. పారిశ్రామిక రాయితీలతోపాటు మౌలిక వసతులపై అధికంగా దృష్టిసారించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన సీఎం జగన్ కోవిడ్ సంక్షోభ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చర్యలు తీసుకున్నారు. రాష్ట్రం గుండా వెళ్తున్న మూడు పారిశ్రామిక కారిడార్లు విశాఖ–చెన్నై, చెన్నై–బెంగళూరు, హైదరాబాద్–బెంగళూరు కారిడార్లలో రూ.11,753 కోట్లతో ఆరు పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు రూ.18,897 కోట్లతో నాలుగు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని కోవిడ్ సమయంలో ఏకకాలంలో చేపట్టారు. అంతేకాకుండా విశాఖ, అనంతపురంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కుల నిర్మాణాన్ని చేపట్టడమే కాకుండా కొప్పర్తి, ఓర్వకల్లు వద్ద మరో రెండు మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కుల కోసం ప్రతిపాదనలు పంపారు. మరోవైపు కాకినాడ వద్ద రూ.1,000 కోట్లతో బల్క్‌డ్రగ్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నారు. వీటివల్ల అభివృద్ధి చేసిన 50,000 ఎకరాలు అందుబాటులోకి రావడంతో పాటు రాష్ట్రంలో ఏర్పాటైన పరిశ్రమల ఉత్పత్తి వ్యయం 80 శాతం వరకు తగ్గనుంది. తద్వారా అంతర్జాతీయ కంపెనీలతో పోటీపడే స్థాయికి ఎదగనున్నట్లు పారిశ్రామిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పారిశ్రామిక మౌలిక వసతుల కోసం ఈ స్థాయిలో వ్యయం చేస్తున్న రాష్ట్రం దేశంలో మరెక్కడా లేదని పేర్కొంటున్నాయి.


శరవేగంగా సాగుతున్న రామాయపట్నం ఫిషింగ్ హార్బర్ల పనులు

■ **కోవిడ్‌లోనే కొప్పర్తి నోడ్ రెడీ**

ఒకపక్క కోవిడ్ సంక్షోభం వెంటాడుతున్నా విశాఖ–చెన్నై కారిడార్ పరిధిలోని కొప్పర్తి నోడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అందుబాటులోకి తెచ్చింది. విశాఖ–చెన్నై కారిడార్‌లో భాగంగా కొప్పర్తి వద్ద 6,739 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందులో 801 ఎకరాల్లో వైఎస్సార్ ఈఎంసీ, 3,053 ఎకరాల్లో వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చింది. ఇదే కారిడార్‌లో భాగంగా నక్కపల్లి, రాంబిల్లి, శ్రీకాళహస్తి, కొప్పర్తి నోడ్‌లను ఏడీబీ, నిక్‌డిక్ట్ నిధులతో అభివృద్ధి చేస్తోంది. ఏడీబీ నిధులతో తొలిదశలో రూ.2,900 కోట్లతో అభివృద్ధి చేయగా రెండోదశలో రూ.1,633 కోట్లతో అభివృద్ధి పనులకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఈనెల 23న ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ ఒక్క కారిడార్ పరిధిలోనే 26,182 ఎకరాలు అందుబాటులోకి రానున్నాయి. ఇక చెన్నై–హైదరాబాద్ కారిడార్ కింద కృష్ణపట్నం వద్ద 11,096 ఎకరాల్లో క్రిస్ సిటీని, హైదరాబాద్ –బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లు వద్ద 9,305 ఎకరాలను అభివృద్ధి చేయనుంది. ఈ పారిశ్రామిక పార్కులకు అవసరమైన నీటి వసతికి సంబంధించిన పనులను కూడా ఏపీఐఐసీ మొదలు పెట్టింది. మరోవైపు ఇప్పటికే కర్నూలు ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తేగా భోగాపురంతోపాటు రామాయపట్నం తెట్టు వద్ద మరో ఎయిర్ పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

■ **గత ప్రభుత్వానికి భిన్నంగా..**

టీడీపీ అధికారంలో ఉండగా తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకోకుండా ఎన్నికలకు నెలన్నర ముందు ఎలాంటి అనుమతులు లేకుండా చంద్రబాబు కొబ్బరికాయ కొట్టి షూటింగ్ ముగించారు. ఇలాంటి వ్యవహారాలకు తావులేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టుల నిర్మాణానికి అవసరమైన అన్ని కీలక అనుమతులు సాధించడంతో పాటు ఆర్థిక వనరులు (ఫైనాన్షియల్ క్లోజర్) సమకూరిన తర్వాతే పనులు ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే రామాయపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టుల నిర్మాణం మొదలు కాగా ఈనెల 22వతేదీన మచిలీపట్నం పోర్టు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం ఏపీ మారిటైమ్ బోర్డును నెలకొల్పడమే కాకుండా మూడు పోర్టులకు ప్రత్యేక కంపెనీలను ఏర్పాటు చేశారు. 2022 జూలైలో పనులు ప్రారంభించిన రామాయపట్నం శరవేగంగా సాకారమవుతోంది. ఈ ఏడాది చివరి నాటికల్లా తొలి ఓడను ఇక్కడకు రప్పించే లక్ష్యంతో ముందుకువెళుతున్నారు.

■ **60,000 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి**

పోర్టులకు అదనంగా 60,000 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి కల్పించేలా తొమ్మిది ఫిషింగ్ హార్బర్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. తొలిదశలో చేపట్టిన జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్లలో పనులు వేగంగా జరుగుతుండటంతో త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. జువ్వలదిన్నె పనులు 86 శాతానికి పైగా పూర్తి కాగా నిజాంపట్నంలో 62 శాతం జరిగాయి. మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల పనులు 50 శాతం దాటాయి. ప్రైవేట్ రంగంలో నిర్మిస్తున్న కాకినాడ గేట్‌వే పోర్టుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మూడు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల కోసం రూ.18,897 కోట్లు వ్యయం చేస్తోంది. ఈ పోర్టులను ఆనుకుని భారీ పారిశ్రామిక నగరాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇందుకోసం ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీని నియమించారు. రాష్ట్రంలో నెలకొల్పే పరిశ్రమలకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను సమకూర్చడంపై కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఇందుకోసం 192 స్కిల్ హబ్స్ ఏర్పాటుతోపాటు 26 స్కిల్ కాలేజీలను ఏర్పాటు చేసింది.

అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా..



పోర్టులు, పారిశ్రామిక పార్కుల నిర్మాణం ద్వారా రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. సహజ వనరులను వినియోగించుకుంటూ మూడు ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టారు. రామాయపట్నం పోర్టుతో ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, మచిలీపట్నంతో కృష్ణా, ఎన్టీఆర్, మూలపేటతో శ్రీకాకుళం జిల్లాలు వేగంగా అభివృద్ధి చెందనున్నాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా మూడు పారిశ్రామిక కారిడార్ల ద్వారా 50,000 ఎకరాల భూమిని అందుబాటులోకి తెస్తున్నాం. అన్ని అనుమతులు, ఆర్థిక వనరులు సమకూరిన తర్వాతే సీఎం జగన్ పనులు ప్రారంభిస్తున్నారు. శంకుస్థాపన మరుసటి రోజునుంచే పనులు నిర్విఘ్నంగా కొనసాగాలన్నది సీఎం ఆకాంక్ష.

– గుడివాడ అమర్నాథ్, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి

జాతీయ స్థాయిలో గుర్తింపు..

అత్యంత ప్రతిష్టాత్మకంగా తీరప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రముఖ బిజినెస్ దినపత్రిక 'ఎకనామిక్ టైమ్స్'దేశీయ ఇన్‌ఫ్రా రంగంపై ఏటా ప్రకటించే అవార్డుల్లో ఈసారి మనకు చోటు దక్కింది. దేశంలో పోర్టు ఆధారిత మౌలిక వసతుల కల్పనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాధించిన అత్యున్నత ప్రగతిని గుర్తిస్తూ ఇన్‌ఫ్రా ఫోకస్ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక మౌలిక వసతులకు పెద్దపీట వేస్తుండటంతో దిగ్గజ సంస్థలైన అదానీ, అంబానీ, మిట్టల్, బిర్లా, భంగర్, భజాంకా, సంఘ్వీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. ఈ ఏడాది మార్చిలో విశాఖ వేదికగా జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో 386 ఒప్పందాల ద్వారా రూ.13,11,468 కోట్ల విలువైన పెట్టుబడులు రావడమే దీనికి నిదర్శనం. గతేడాది చివరి త్రైమాసికంలో అత్యధిక పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రంగా ఏపీ మొదటి స్థానంలో ఉన్నట్లు ప్రాజెక్ట్స్ టుడే సర్వే వెల్లడించింది.

జూరాలలో 7.188 టీఎంసీల నీటినిల్వ

● 2 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద కాస్త పెరిగింది. గత నెల చివరిలో ప్రాజెక్టులో నీటిమట్టం 3.5 టీఎంసీలు ఉండగా.. ఎగువన కురిసిన వర్షాలకు దాదాపు నాలుగు టీఎంసీల నీరు వచ్చి చేరింది. దీంతో నీటితో కళకళలాడుతూ పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరువలో ఉంది. ఆదివారం 2,059 క్యూసెక్కుల వరద ప్రాజెక్టుకు వచ్చిందని అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.188 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. 149 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

21జీడియల్ 355 వరద జలాలతో కళకళలాడుతున్న జూరాల ప్రాజెక్టు

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉందని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వల నుంచి నీటి సరఫరా నిలిచి పోగా.. ఎన్టీఆర్ కాల్వకు నీటి తరలింపు నిలిపి వేశామని వివరించారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు.

నల్లమల యువకుడికి భూషణ్ పురస్కార్



అచ్చంపేట రూరల్: మానసిక దివ్యాంగ చిన్నారులకు సేవలందిస్తున్న ఉప్పునుంతల మండలం కంసానిపల్లికి చెందిన చలమల శ్రీనివాసులుగౌడ్‌కు గ్లోబల్ స్కాలర్ ఫౌండేషన్ 'భూషణ్ పురస్కార్'ను ప్రదానం చేసింది. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పద్మశ్రీ డా. అలంపూర్ సాయిబాబాగౌడ్ ఈ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లో వీకెన్ థెరపీ సెంటర్ ఫర్ ఆటిజం డైరెక్టర్ శ్రీనివాసులుగౌడ్ చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డు అందించారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చల్లగా తాగేస్తున్నారు..!

- మండుటెండలతో బీర్లకు పెరిగిన గిరాకీ
- చల్లదనానికి మందుబాబుల తహతహ
- ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం



మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో 42 నుంచి 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో మద్యం విక్రయాలు పెరిగాయి. వేడిని తట్టుకోవడానికి మద్యం ప్రియులు ఎక్కువగా చల్లటి బీర్లు తాగేందుకు ఆసక్తి కనబరుస్తుండటంతో మార్కెట్‌లో వీటికి డిమాండ్ పెరిగింది. సహజంగానే వేసవిలో బీర్ల విక్రయాలు ఎక్కువగా ఉంటుండగా.. ఈసారి గతంలో ఎప్పుడూ లేనంతగా ఎండలు మండిపోవడంతో అమ్మకాలు మరింత పెరిగి కొరత ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాలకు తిమ్మాజిపేట, కొత్తకోట డిపోల నుంచి మద్యం సరఫరా జరుగుతోంది.

■ సహజంగా ఏటా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మద్యం విక్రయాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ మూడు నెలల్లో కూడా ఎక్కువగా బీర్లకు డిమాండ్ పెరుగుతుంది. ఎండల తీవ్రత బట్టి జూన్, జులైలో కూడా అమ్మకాలు అధికంగా జరిగే అవకాశం ఉంటుంది.

బాగా పెరిగాయి..

ఉమ్మడి జిల్లాలో మూడునెలల నుంచి బీర్ల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. గతేడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది మార్చిలో 18 శాతం, గతేడాది ఏప్రిల్ కంటే ఈ ఏడాది ఏప్రిల్‌లో 21.8 శాతం బీర్ల అమ్మకాలు పెరిగాయి. మే నెల చివరి వరకు మరింత అధికమవుతాయి. ఎండలు అధికంగా ఉండటంతో బీర్ల విక్రయాలు పెరిగాయి.

– సైదులు, ఈఎస్, మహబూబ్‌నగర్

ఉమ్మడి జిల్లాలో మద్యం విక్రయాల వివరాలు

నెల	ఐఎంఎల్	బీర్లు	విక్రయ మొత్తం (రూ.లక్షల్లో..)
మార్చి	2,31,595	3,90,344	24186.32
ఏప్రిల్	1,84,988	3,24,778	19508.89
మే	1,26,028	3,13,281	14204.45

(20.05.23 వరకు)



తెలంగాణలో పేదల బతుకులు మారలే


ఎర్రవల్లిలో చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఎర్రవల్లి చౌరస్తా: కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నేటికీ పేదల బతుకులు మారలేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన బహుజన రాజ్యాధికార పాదయాత్ర ఆదివారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి, జింకలపల్లిలో సాగింది. ఆయా గ్రామాల ప్రజలతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎర్రవల్లిలో చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు నేటికీ ఎందుకు అలాగే మిగిలిపోయారని ప్రశ్నించారు. ఇంకెంత కాలం నిరుపేదలు కూలీపని చేస్తూ బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల బతుకులను మార్చకుండా పాలకులు అంబేడ్కర్ విగ్రహాలు పెట్టుకోమని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహాలు పెట్టడం మాత్రమే కాదని.. ఆయన చెప్పిన మాటలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధనిక రాష్ట్రంలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందడం లేదని, అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్‌లకు సక్రమంగా బిల్లులు ఇవ్వడం లేదని విమర్శించారు. మండలంలో విషవాయువులు వెదజల్లుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కంపెనీలను వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు, జిల్లా ఇన్‌చార్జ్ కృష్ణ, నాయకులు రవిచంద్ర, మహేష్, కనకం బాబు, హన్మన్న, నాగరాజు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం


బండపల్లిలో శిలఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: గ్రామాల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బండపల్లిలో రూ.82.13 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు, డంపింగ్ యార్డు, స్కూల్ ప్రహరీ, క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం పనులు చేపట్టినట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమ్‌నాథ్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, సర్పంచ్ రాజేశ్వరమ్మ, మాజీ జెడ్పీటీసీ రాంమూర్తినాయుడు, పీఆర్ డీఈ చెన్నయ్య, ఏఈ సత్తయ్య పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని వినతి..

మండల సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో పలుజీపీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు మంజూరు చేయించాలని, జీపీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కోశాధికారి వెంకటయ్యయాదవ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కేసు నమోదు

చారకొండ: సన్న బియ్యం పేరుతో రేషన్ బియ్యం విక్రయిస్తున్న వారిని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కళ్యాణ్‌రావు కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాకు చెందిన మాగుంట్ల ఏసుబాబు, కుచాల విశ్వేశ్వర్‌రావు, దుర్గ నర్సింహ, ఈర్ల లక్ష్మీనారాయణ, తిమ్మిశెట్టి నర్సింహ, ఈర్ల రాంబాబు, గొడ్డల గోపి రేషన్ బియ్యాన్ని సంచుల్లో నింపి సన్నబియ్యం అంటూ మండల కేంద్రంలో విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు. క్వింటా బియ్యంతో పాటు రెండు స్కూటీలను స్వాధీనం చేసుకొని ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులు అడ్డుకున్న గ్రామస్తులు


పనులు అడ్డుకుంటున్న నిర్వాసితులు

గట్టు: మండలంలోని చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులను నిర్వాసితులు ఆదివారం మరోమారు అడ్డుకున్నారు. 18 ఏళ్ల క్రితం రిజర్వాయర్ పనులు ప్రారంభించారని.. అప్పుడే పూర్తి చేసి ఉంటే ఏ ఇబ్బంది ఉండేది కాదన్నారు. ఇన్నాళ్ల తర్వాత పనులు ప్రారంభిస్తాం.. ఇళ్లు ఖాళీ చేయాలంటున్నారని, ఎక్కడికి వెళ్లాలని నిర్వాసితులు వాపోతున్నారు. పునరావాస కేంద్రంలో సౌకర్యాలు లేవని, ప్రస్తుత మార్కెట్ ధరలకు అక్కడ ఇళ్లు నిర్మించుకునే పరిస్థితి లేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వట్టెం రిజర్వాయర్‌కు ఇచ్చిన జీఓనే చిన్నోనిపల్లికి వర్తింపజేయాలని, కలెక్టర్ నేరుగా చర్చించి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడుదాం


మాట్లాడుతున్న సైకిలాబ్‌బాబు

కల్వకుర్తి రూరల్: దేశంలో పెరిగిపోతున్న మతోన్మాద హింసను అడ్డుకొని రాజ్యాంగ లౌకిక ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుందామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైకిలాబ్‌బాబు అన్నారు. ఆదివారం కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి వేసి.. ప్రాచీన భారత రాజ్యాంగం ప్రవేశపెట్టాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఇందులో భాగంగా ప్రతిఒక్కరినీ చైతన్యం చేసేందుకు వచ్చే నెల 5 నుంచి కల్వకుర్తిలో కేవీపీఎస్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి పరశురాములు చెప్పారు. సమావేశంలో నాయకులు భాస్కర్, అశోక్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ సరదా..

అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నియోజకవర్గంలో పర్యటించారు. రూరల్ మండలం ఫతేపూర్ శివారులో క్రికెట్ ఆడుతున్న చిన్నారులను చూసి కారు దిగి వారితో కలిసి సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. మంత్రి స్వయంగా వచ్చి తమతో కలిసి క్రికెట్ ఆడటంతో చిన్నారులు ఆనందంలో మునిగిపోయారు.

– మహబూబ్‌నగర్ రూరల్